క్లుప్తంగా

స్వారా ధ్వంసం



సారాను ధ్వంసం చేస్తున్న ఎల్విన్‌పేట పోలీసులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలో వివిధ సందర్భాల్లో పట్టుకున్న సారాను ఎల్విన్‌పేట పోలీసులు మంగళవారం ధ్వంసం చేశారు. ఎల్విన్‌పేట స్టేషన్ పరిధిలో 19 కేసుల్లో పట్టుకున్న 660 లీటర్ల సారాతో పాటు నీలకంఠాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 6 కేసుల్లో పట్టుకున్న 54 లీటర్ల సారాను ధ్వసం చేసినట్లు ఎస్సై ఎస్.షణ్ముఖరావు చెప్పారు. ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఆర్.సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు వీరఘట్టంలో 'గడపగడపకు..'

వీరఘట్టం: వీరఘట్టం సచివాలయం-1,3,4 పరిధిలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ నేతృత్వంలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ వి.రామచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత వలంటీర్లు, సచివాలయం సిబ్బంది హాజరు కావాలని కోరారు.

ఘనంగా పూలంగి సేవ



విశేష అలంకరణలో దర్శనమిస్తున్న స్వామివారు

సాలూరు: పట్టణంలోని పెదకోమటిపేట రామాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పూలంగి సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారికి వివిధ రకాల పూలతో అలంకరించి విశేష పూజలు చేశారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

కుట్టు మిషన్లు, సైకిళ్ల పంపిణీ




కుట్టుమిషన్లు, సైకిళ్లు అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, తదితరులు

సాలూరు: పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గురు పేద మహిళలకు కుట్టు మిషన్లు, డబ్బి వీధి, వేద సమాజం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఐదుగురు విద్యార్థినులకు సైకిళ్లను మంగళవారం పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి చేతుల మీదుగా వీటిని అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, ప్రముఖులు అన్నంరాజు గుప్త, తిరుమలాచార్యులు, పి.గోపి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

సాలూరు: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ రామస్వామికి తమ సమస్యలపై వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేయాలని, కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎన్‌వై నాయుడు, బి.రాధ, వరలక్ష్మి, ఇతర సభ్యులు ఉన్నారు.

రీ సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: దీర్ఘకాలంగా గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ వివాదాలను పరిష్కరించడానికి అమలు చేసిన జగనన్న శాశ్వత 'భూ రక్ష', 'భూ'హక్కు పొందానికి రీ సర్వే చేస్తున్న అధికార సిబ్బందికి రైతులు సహకరించాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు మంగళవారం బక్కుపేటలో సర్వే సిబ్బంది భౌతికంగా నిర్వహిస్తున్న రీసర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతాబ్దకాలంగా భూముల సర్వే నిర్వహించక పోవడం వల్ల ఆయా భూములపై క్రయ, విక్రయాలు, రుణాలు పొందే సమయంలో సాంకేతిక పరమైన సమస్యలు వస్తున్నాయన్నారు. రైతుల పేరున జిరాయితీ భూములు లేవని ఇతరుల పేరున ఉండడాన్ని సర్వే సిబ్బంది గుర్తించారని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం జిరాయితీ భూములున్న రైతులకు న్యాయం చేయదానికి, అన్యాక్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తిస్తామని తెలిపారు. ఇప్పటికే డ్రోన్ సర్వే, రోవర్ సహాయంతో సర్వే పనులు పూర్తి కావచ్చాయన్నారు. గ్రామాల్లోని పొలాల్లో రీ సర్వే చేస్తున్న భూముల వివరాలను నిర్దేశించిన రైతులు సమకూర్చి సహకరించాలని కోరారు. త్వరలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా భూముల హక్కుపత్రాలను పంపిణీ చేస్తామని వెల్లడించారు. రీసర్వే డీటీ చిట్టెమ్మ, మండల సర్వేయర్, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో పేదలందరికీ లబ్ధి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



చినవంకధారలో సంక్షేమ పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న ప్రభుత్వం ఎంతో లబ్ధిని చేకూరుస్తోందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని జర్న గ్రామ సచివాలయం పరిధి బబ్బిడి, చినవంకధార, బొద్దిడి, ఎగువ చోరుపల్లి, రాయివలస, దిగువచోరుపల్లి, జర్న, జర్నవలస గ్రామాల్లో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడున్నరేళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాల ద్వారా ఎంతో లబ్ధి చేకూర్చిందన్నారు. పార్టీలకు అతీతంగా.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాల లబ్ధిని పొందుతున్నారన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, నిమ్మక లక్ష్మణరావు, జర్న సర్పంచ్ కొండగొర్రి ఉష, పార్టీ నాయకులు కె.రాజేష్, మూటక కృష్ణారావు, సామల మాధవరావు, కృష్ణమూర్తి, ఫిలిప్, ప్రశాంత్, సోములతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు కేరాఫ్ జగనన్న ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: గత ప్రభుత్వాలకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సంక్షేమానికి కేరాఫ్ అడ్రాస్‌గా నిలుస్తుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పుబ్బాడ, పుబ్బాడగూడ సచివాలయ పరిధిలో పర్యటించారు. ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారుతులు ఇచ్చి తమ ఇంటికి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా? ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతికి ఆస్కారం లేకుండా.. నేరుగా అర్హుల బ్యాంకు ఖాతాల్లోనే సంక్షేమ పథకాల నగదు బదిలీ చేస్తుండడంతో ప్రజలందరూ సంతోషిస్తున్నారన్నారు. నవరత్నాలు ప్రతీ గడపలోనూ వెలుగులు నింపడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. ప్రతీ ఇంటికి అమ్మ ఒడి, రైతుభరోసా, వైఎస్సార్ పంటల బీమా, జగనన్న చేదోడు, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ రుణాలు తదితర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. గ్రామ వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగనన్న నిలిచారన్నారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రజా సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లోను మళ్లీ ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ప్రజలను కోరారు. పాచిపెంట మండలం పంచాది గ్రామంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాజన్నదొరకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటికి వెళ్లిన రాజన్నదొర, జగనన్న పాలనలో ఇప్పటివరకు ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పనితీరుపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను విన్న ఆయన వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలతో మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి అందిస్తున్న నగదును మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలు నాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, నాయకులు నారాయణ, పెద్దిబాబు, వెంకటరావు, అప్పన్నబాబు, సత్యనారాయణ, ఇజ్జాడ అప్పలనాయుడు, ధనుంజయ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు

కొమరాడ: హౌసింగ్ లబ్ధిదారులంతా త్వరిగతిన ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎల్.వి. అప్పారావు అన్నారు. మండలంలోని పరుశురాపురం సచివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించారు. సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా చూడాలని సిబ్బందికి సూచించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం గృహనిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడారు.

రూ.కోట్ల విలువైన స్థలాన్ని పేదలకు ఇస్తున్నాం



మాట్లాడుతున్న తహసీల్దార్ మాధవి

వీరఘట్టం: కోట్ల రూపాయిల స్థలాన్ని ఇళ్లులేని పేదలకు ఇచ్చేందుకు ప్రభుత్వం నిశ్చయించదని, అందుకు లబ్ధిదారులు కూడా సమ్మతిస్తే వీరఘట్టంకు సమీపంలో ఉన్న మరియగిరి వద్ద జగనన్న గృహ నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా ఇళ్ల పట్టాలు ఇస్తామని తహసీల్దార్ జె.మాధవి అన్నారు. స్థానిక కోదండరామా కల్యాణ మండపం వద్ద లబ్ధిదారులతో మంగళవారం సమావేశం నిర్వహించి అభిప్రాయ సేకరణ చేశారు. అయితే కొందరు వీరఘట్టం మేజరుపంచాయతీలోనే ఇళ్ల పట్టాలని ఇవ్వాలని కోరారు. మరి కొందరు మాత్రం మరియగిరి వద్ద ఇళ్ల పట్టాలు ఇప్పించాలని కోరారు. వీరఘట్టంలో 152 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇస్తామని, దీనికి సంబంధించి వలంటీర్లు ఒక అప్లికేషన్ ఇచ్చాం, ఇళ్ల స్థలం కావాల్సిన వారు ఆ అప్లికేషన్ నింపి వలంటర్ల ద్వారా తమకు అందజేయాలని ఆమె కోరారు.

గ్రామ సంఘాల సభ్యులకు ఆన్‌లైన్ శిక్షణ



వెలుగు కార్యాలయంలో ఆన్‌లైన్ శిక్షణ పొందుతున్న మహిళలు

బలిజిపేట: సంస్థాగత నిర్మాణంపై గ్రామ సంఘాల సభ్యులకు ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెర్ప్ విజయవాడ వారి ఆధ్వర్యంలో ఐబీ డైరెక్టర్ సత్యభామ మహిళా సంఘాల సభ్యులకు బలిజిపేట మండల కేంద్రంలోని వెలుగు శిక్షణ కార్యాలయంలో శిక్షణ అందించారు. సంఘాల పునర్నిర్మాణం, ఆగిపోయిన సంఘాల పునరుద్ధర ణ, సంఘాల జీవనోపాధి, అభివృద్ధి, అప్పుగా తీసు కున్న మొత్తాల వినియోగం, తదితర అంశాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. చిన్న సంఘాలను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి? వాటిని పెద్ద సంఘాలుగా ఎలా అభివృద్ధి చేసుకోవాలో శిక్షణలో మహిళా సభ్యులకు తెలియజేస్తారు. కార్యక్రమంలో ఏపీఎం ఉమామహేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

వాహనాల వేలం



వేలం పాటను నిర్వహిస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

కురుపాం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో సారా కేసుల్లో సీజ్ చేసిన ఏడు ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను మంగళవారం వేలం వేశారు. ఎస్ఈబీ సూపరింటెండెంట్, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, కురుపాం ఎస్ఐ సీహెచ్.ప్రసాద్ ఆధ్వర్యంలో వేలం ప్రశాంతంగా నిర్వహించారు. కొనుగోలు దారులు నిర్దేశిత నగదు చెల్లించి వాహనాలను దక్కించుకున్నారు.

నేడు భామినిలో..

భామిని: సారా కేసుల్లో సీజ్ చేసిన రెండు ఆటోలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఈబీ కార్యాలయం ఆవరణలో బుధవారం వేలం వేయనున్నట్లు స్టేషన్ ఇన్‌చార్జి డి.ప్రభాకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ముందస్తు దరావత్తు చెల్లించి ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



పాలకొండ రూరల్: కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు



పాలకొండ రూరల్: వాలీబాల్‌లో ప్రతిభ కనపరుస్తున్న పాలకొండ క్రీడాకారులు



కొమరాడ: విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైస్ ఎంపీపీ నంగిరెడ్డి

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం శ్రీకాకుళం నెహ్రూ యువజన కేంద్రం నేతృత్వంలో నిర్వహించిన సంక్రాంతి క్రీడా పోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగాయి. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ జి.జనార్దననాయుడు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ పండగల్లో క్రీడలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. క్రీడా నిర్వాహకులు కె.గోవింద మాట్లాడుతూ కబ్బడీ పోటీలకు 5 జట్లు, వాలీబాల్ పోటీలకు నాలుగు జట్లు, రన్నింగ్ పోటీలో పలువురు క్రీడాకారులు పాల్గొనట్లు వివరించారు. పీఈటీ ఎస్.సీతారాం, కళాశాల అధ్యపకులు పోటీలను పర్యవేక్షించారు.

వాలీబాల్ విజేత కంచరపాడు

కొమరాడ: మండలంలోని కంబవలస పంచాయతీ కంచరపాడు గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా వారం రోజులుగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పది జట్లు పాల్గొనగా.. కంచరపాడు జట్టు ప్రథమ స్థానంలో, రాజ్యలక్ష్మీపురం ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు చేతులమీదుగా మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బృందవనరాయుడు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ నవ్య

సీతంపేట: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ బి.నవ్య ఆదేశించారు. మండలంలోని ఇంజినీరింగ్ సహాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా గృహ నిర్మాణాలపై సమీక్షించారు. ఇప్పటి వరకు బిల్లులు కాని వారికి మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. వీఈఏలకు నిర్దేశించిన లక్ష్యాలను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. శ్లాబ్ లెవల్, శ్లాబులు పూర్తిచేసిన గృహాలను ఉగాది నాటికి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, హౌసింగ్ ఏఈ వెంకటేష్, అసిస్టెంట్ సంతోష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు



సింగన్నవలసలో గ్రామీణ వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

పాలకొండ: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో విలేజ్ హెల్త్ కేర్ సెంటర్లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. 104 వైద్య సేవలను ప్రజలకు చేరువ అయ్యేలా చూడాలన్నారు. ఆయనతో పాటు అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమల్‌నాథ్ ఉన్నారు.

ఆడపిల్లను భారంగా భావించొద్దు

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయ పార్వతి



వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి

భామిని: ఆడపిల్లను భారంగా భావించరాదని, బాల్య వివాహాల జోలికి పోవద్దని సీతంపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయపార్వతి అన్నారు. మండలంలోని కాట్రగడ-బిలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు. ప్రజలకు ఇంటి వద్దే వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. వైద్యులు మీ ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు చేసి, మందులు అందజేయడం జరుగుతుందన్నారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా బత్తిలి పీహెచ్‌సీ డాక్టర్ కొండపల్లి రవీంద్ర, 104 డాక్టర్ శంకరనారాయణ ప్రజలకు వైద్య సేవలందించారు. అనంతరం గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారుల ఆరోగ్యాన్ని పరీక్షించారు. సబ్‌యూనిట్ అధికారి అప్పారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై దృష్టిపెట్టాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన విభాగంపై సిబ్బంది దృష్టి పెట్టాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. మండలంలోని సచివాలయాల డిజిటల్ సహాయకులు, కార్యదర్శులతో మంగళవారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. మండలంలో గతంలో మంజూరైన గృహాలు సకాలంలో లబ్ధిదారులచే పూర్తి చేయించాలన్నారు. వాటిలో జియోట్యాగ్ చేయాల్సిన గృహాలు 55, రిజిస్ట్రేషన్ చేయించాల్సినవి 20 ఉన్నాయన్నారు. అలాగే మండలంలో నూతనంగా 479 ఇళ్లు కొత్తగా మంజూరైనట్లు తెలిపారు. వాటిలో రిజిస్ట్రేషన్లు, జియోట్యాగ్ చేయాల్సినవి 344 ఉన్నట్లు సిబ్బంది వివరించారు. గృహ లబ్ధిపొందినవారి వివరాలపై పంచాయతీల వారీగా ఎంపీడీఓ సమీక్ష చేపట్టారు. ఈ ఏడాది మార్చి 22 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయించాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



మస్తర్లను పరిశీలిస్తున్న జేఈ తేజ

జియ్యమ్మవలస: మండలంలోని బీజేపురంలో చేపట్టిన ఉపాధిహామీ పథకం పనులను జేఈ తేజ, ఏపీఓ శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. పనికి హాజరైన వేతనదారుల సంఖ్య, మస్తర్లను పరిశీలించారు. రెండుపూటలా పని చేయాలని, నిర్దేశిత కొలతలు పూర్తి చేసినట్లయితే పూర్తిస్థాయి వేతనం వస్తుందని వేతనదారులతో అన్నారు. పనులకు హాజరుకాని వారికి మస్తర్లు నమోదు చేస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన విద్య



మాట్లాడుతున్న ఎంఈఓ ఆనందరావు

సీతంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్నామని ఎంఈఓ ఎం.ఆనందరావు అన్నారు. పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బడిఈడు పిల్లలను బడికి పంపించాలన్నారు. ఎవ్వరూ డ్రాపౌట్ అవ్వకూడదన్నారు. సంక్రాంతి సెలవుల అనంతరం ప్రతీ రోజు పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదిలక్ష్మి, హెచ్‌ఎం సవర ప్రసాద్, ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు, పేరెంట్ కమిటీ చైర్మన్ ఎ.కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్



హిందీ దివస్ నిర్వహిస్తున్న టీచర్లు, విద్యార్థులు

సీతంపేట: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం విశ్వ హిందీ దివస్‌ను నిర్వహించారు. దేశంలో ఎన్ని ప్రాంతీయ భాషలున్నా దేశ ఐక్యత కోసం అధికంగా మాట్లాడే హిందీ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని వక్తలు పిలుపునిచ్చారు. హిందీలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. హిందీ ఉపాధ్యాయులు పద్మశ్రీ, కల్యాణి స్కూల్ లైబ్రరీకి పలు హిందీ వ్యాకరణ పుస్తకాలు అందించారు. హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన యంగ్ మేరీ మహోత్సవం



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బిషప్ విజయకుమార్

భామిని: మండలంలోని ఇసుకగూడ-సన్నాయిగూడ సమీపంలో వెలసిన యంగ్ మేరీ కేవ్ వద్ద నిర్వహించిన మేరీమాతా మహోత్సవం మంగళవారం ముగిసింది. మూడు రోజులుగా నిర్వహించిన ఈ ఉత్సవాల ముగింపు సభకు శ్రీకాకుళం నేత్రాసనం బిషప్ రాయరాల విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివ్యబలిపూజ చేసి దేవుని వాఖ్యాలు వినిపించారు. స్థానిక చర్చ్ ఫాదర్ తుమ్మ డొమినిక్ రెడ్డి, విదేశీ ప్రచారకులు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భామిని, కొత్తూరు, సీతంపేట మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ఆదివాసీ విశ్వాసకులు పాల్గొన్నారు. వీనుల విందుగా క్రైస్తవ భక్తిగీతాలను ఆలపించారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు.

124 మందికి వైద్యసేవలు

పాలకొండ: మండలంలోని సింగన్నవలస గ్రామంలో 104 ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ గ్రామంలో సుమారు 124 మందికి బీపీ, షుగర్, ఇతర వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఆరోగ్య సలహాలు అందించారు.

శిబిరంలో ఏఎన్ఎం తేజ, ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, ఆశా వర్కర్ లక్ష్మి, సచివాలయ సిబ్బంది సేవలందించారు.